www.prajapathrika.in
ప్రజా పత్రిక
తెలుగు దినపత్రిక
మంగళవారం15 జులై 2025

# హైదరాబాద్‌లో జాబ్ డ్రైవ్‌కి విశేష స్పందన

- 700 మందికి పైగా హాజరు
- 80+ మంది ఉద్యోగాల్లో ఎంపిక




హైదరాబాద్ ,14 జూలై (ప్రజా పత్రిక): హైదరాబాద్‌లోని మాసబ్ ట్యాంక్ TASK కార్యాలయంలో Cause4U International, TASK (తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ & నాలెడ్జ్) మరియు DEET తెలంగాణ సంయుక్తంగా నిర్వహించిన వాక్-ఇన్ జాబ్ డ్రైవ్ విజయవంతం అయింది. ఈ డ్రైవ్‌కు 700 మందికి పైగా అభ్యర్థులు హాజరయ్యారు. వారిలో 80 మంది పైగా IT మరియు Non-IT ఉద్యోగాల్లో ఎంపిక అయ్యారు.ఈ డ్రైవ్‌లో Apex Covantage, Hayagreeva ,Yasasvee zenith,Jupyter, Araha infotech, Agrihar, 3G HR, Lyros వంటి ప్రముఖ సంస్థలు పాల్గొన్నాయి. ఇది డిగ్రీ, బీటెక్, డిప్లొమా, ఐటీఐ విద్యార్హతతో నిర్వహించబడిన డ్రైవ్ అని నిర్వాహకులు తెలిపారు .ఈ కార్యక్రమం విజయవంతం అవడంతో TASK సిఈఓ శ్రీకాంత్ సిన్హా, TASK ప్రోగ్రామ్ మేనేజర్ ప్రదీప్ రెడ్డి , TASK ప్లేస్‌మెంట్ మేనేజర్ లక్ష్మణ్ , DEET అసోసియేట్ డైరెక్టర్ వంశీ ,Cause4U అంతర్జాతీయ HR మేనేజర్ హర్షిత తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.“ఇది కేవలం ఉద్యోగ మేళా మాత్రమే కాదు, యువత భవిష్యత్తును నిర్మించే మద్దతుగా నిలిచిన ఒక గొప్ప వేదిక అని నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఈ డ్రైవ్ ను నిర్వహించామని వారు తెలిపారు .



# నేను తలుచుకుంటే 10 వేల మందితో వేమిరెడ్డి ఇల్లు కూల్చగలను: ప్రసన్నకుమార్‌రెడ్డి



ఏపీ ,14 జూలై (ప్రజా పత్రిక):వైసీపీ మాజీ ఎమ్మెల్యే ప్రసన్న కుమార్ రెడ్డి కోవూరు టీడీపీ ఎమ్మెల్యే అయిన ప్రశాంత్రి రెడ్డి పై చేసిన అనుచిత వ్యాఖ్యలు పెద్ద దుమారం రేపాయి. మహిళా ఎమ్మెల్యేపై చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహించిన పలువురు టీడీపీ నేతలు, ఎమ్మెల్యే అభిమానులు.. ప్రసన్న కుమార్ ఇంటిపై దాడి చేసి, ఇంటిని ధ్వంసం చేసిన విషయం తెలిసిందే. అయితే ఈ దాడి వ్యవహారంపై నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి స్పందిస్తూ.. మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. వేమిరెడ్డి దంపతులే తన ఇంటిపై దాడి చేయించారని తీవ్ర ఆరోపణలు చేశారు. అలాగే తన ఇంటిపై జరిగిన దాడికి సంబంధించిన సాక్ష్యాలు, వీడియోలు చూపించినా పోలీసులు కేసు పెట్టలేదని ఆరోపించారు. అలాగే తాను తలుచుకుంటే 10 వేల మందితో వెళ్లి.. వేమిరెడ్డి ఇల్లు కూల్చి వారిని ఎత్తుకురాగలనంటూ.. ప్రసన్నకుమార్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. దీంతో ఆయన వ్యాఖ్యలపై తీవ్ర అభ్యంతరాలు వస్తున్నాయి.


# శంకరమంచి రామకృష్ణశాస్త్రికి తెలంగాణ విద్వత్సభ విశిష్ట పురస్కారం



హైదరాబాద్ ,14 జూలై (ప్రజా పత్రిక):శృంగేరి పీఠ ఆస్థాన జ్యోతిర్విద్వాంసులు బ్రహ్మశ్రీ డాక్టర్ శంకరమంచి రామకృష్ణశాస్త్రిని తెలంగాణ విద్వత్సభ విశిష్ట పురస్కారం వరించింది. శృంగేరి ఉభయ జగద్గురువుల అనుగ్రహంతో, తెలంగాణ రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ సహకారంతో నిర్వహించిన తెలంగాణ విద్వత్సభ నవమ వార్షిక విద్వత్సమ్మేళనంలో ఈ పురస్కారాన్ని ఆయనకు ప్రదానం చేశారు. పుష్పగిరి జగద్గురు మహాసంస్థానంలో (బేగంపేట) ఆదివారం ఈ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది.

పుష్పగిరి పీఠాధీశ్వరులు శ్రీశ్రీశ్రీ అభినవోద్దండ విద్యాశంకర భారతీ స్వామివారి సమక్షంలో రామకృష్ణశాస్త్రిని సత్కరించారు. విద్వత్సభ అధ్యక్షులు యాయవరం చంద్రశేఖరశర్మ, ఉపాధ్యక్షులు జనగామ సిద్ధాంతి సంపత్ కుమార కృష్ణమాచారి, కార్యదర్శి దివ్యజ్ఞాన సిద్ధాంతి పర్యవేక్షణలో జరిగిన ఈ సభకు దర్శనం శర్మ సారథ్యం వహించారు. ఈ కార్యక్రమంలో వనం జ్వాలా నరసింహమూర్తి, పూర్వ కేంద్రమంత్రి సముద్రాల వేణుగోపాలాచారి, యాదాద్రి దేవస్థానం ప్రధాన అర్చకులు లక్ష్మీ నరసింహాచార్యులు, వెంకటేశ్వర శర్మ, వెన్నంపల్లి జగన్మోహన శర్మ, సాగి కమలాకర శర్మ, గాడిచర్ల నాగేశ్వర సిద్ధాంతి, సంధ్యాలక్ష్మి తదితర ప్రముఖులు, పండితులు పాల్గొన్నారు. డాక్టర్ శంకరమంచి రామకృష్ణశాస్త్రికి ఈ విశిష్ట పురస్కారం లభించడంపై విద్యావేత్తలు, పండితులు హర్షం వ్యక్తంచేశారు

# నర్సు నిమిషా ప్రియ ఉరిశిక్షపై ఏం చేయలేం.. సుప్రీంకోర్టుకు కేంద్రం వెల్లడి



ఇంటర్నెట్ డెస్క్ ,14 జూలై (ప్రజా పత్రిక):యెమెన్‌లో భారత సంతతికి చెందిన కేరళ నర్సు నిమిషా ప్రియ ఉరిశిక్షపై కేంద్రం చేతులెత్తేసింది. ఉరిశిక్షను నిలిపివేసేందుకు అన్ని చర్యలు చేపట్టామని.. దౌత్యపరంగా చేపట్టాల్సిన అన్ని అయిపోయాయని సుప్రీంకోర్టుకు కేంద్రం స్పష్టం చేసింది. ఇక తమ చేతుల్లో ఏమీలేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఉరిశిక్ష నిలిపివేతపై దాఖలైన పిటిషన్ల విచారణ సందర్భంగా న్యాయస్థానానికి సోమవారం కేంద్రం ఈ విధంగా తెలియజేసింది.

కేరళలోని పాలక్కాడ్ జిల్లాకు చెందిన నిమిషా ప్రియ 2017, జూలైలో యెమెన్ జాతీయుడు తలాల్ అబ్దో మెహదీని హత్య చేసిన కేసులో అరెస్టు అయింది. మరొక నర్సు సహాయంతో మత్తుమందు ఇచ్చి హత్య చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇద్దరూ కలిసి అతని శరీరాన్ని ముక్కలు చేసి, అవశేషాలను భూగర్భ ట్యాంక్‌లో పడవేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అయితే నిమిషా ఈ ఆరోపణలను కోర్టులో సవాలు చేసింది. కానీ కోర్టులు ఆమె అప్పీళ్లను తోసిపుచ్చాయి. చివరికి ఈ కేసులో ఆమెను దోషిగా తేల్చింది. అనంతరం న్యాయస్థానం ఆమెకు ఉరిశిక్ష విధించింది.

అయితే ప్రస్తుతం యెమెన్ దేశం హౌతీల నియంత్రణలో ఉంది. దీంతో దౌత్యపరంగా భారత్‌కు అడ్డంకులు ఎదురయ్యాయి. ఆమె విడుదల కోసం కేంద్రం చేసిన ప్రయత్నాలు ఏ ఒక్కటి ఫలించలేదు. నర్సు విడుదల కోసం కేంద్రం చేపట్టాల్సిన చివరి ప్రయత్నాన్ని కూడా చేపట్టినా ప్రయోజనం లేదని కోర్టుకు కేంద్రం తరపున అటార్నీ జనరల్ తెలిపారు.

నిమిషా ప్రియ.. 2008 నుంచి యెమెన్‌లో నర్సుగా పనిచేస్తోంది. 2011లో వివాహం తర్వాత ఆమె తన భర్త టామీ థామస్‌తో కలిసి యెమెన్ దేశానికి వెళ్లింది. 2014లో యెమెన్‌లో అంతర్యుద్ధం కారణంగా ఆమె భర్త కుమార్తెతో కేరళకు తిరిగి వచ్చేశాడు. నిమిషా మాత్రం యెమెన్‌లోనే ఉండిపోయింది. అనంతరం ఆమె యెమెన్ జాతీయుడితో కలిసి నర్సింగ్ హోమ్ ప్రారంభించింది. అయితే ఆమెపై మెహదీ అఘాయిత్యం చేయబోయాడు. అనేక మార్లు శారీరికంగా వేధించాడు. అంతేకాకుండా పాస్‌పోర్టును కూడా స్వాధీనం చేసుకున్నాడు. అయితే పాస్‌పోర్టును తిరిగి పొందే క్రమంలో మత్తు మందులు ఇచ్చానని.. కానీ అతడు అధిక మోతాదులో తీసుకోవడం వల్లే చనిపోయినట్లు ఆమె చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఆమె సనా సెంట్రల్ జైలులో ఉంది. మంగళవారం ఉరిశిక్ష పడే సూచనలు కనిపిస్తున్నాయి.

ఇక ఉరిశిక్షను ఆపాలంటూ ప్రధాని మోడీకి కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ కోరారు. ఈ మేరకు ఫిబ్రవరి 6, మార్చి 24, 2025న లేఖలు రాశారు. కేంద్ర ప్రభుత్వానికి, విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్‌కు లేఖలు పంపి విజ్ఞప్తి చేశారు. అలాగే కాంగ్రెస్ సీనియర్ నేత వేణుగోపాల్ కూడా కేంద్రాన్ని కోరారు. అయితే కేంద్రం చేసిన ప్రయత్నాలు విఫలం అయ్యాయి.

# మేడిగడ్డ బరాజ్‌కు తగ్గిన వరద.. ఇన్ ఫ్లో, అవుట్ ఫ్లో 1,75,430 క్యూసెక్కులు



మహదేవపూర్ ,14 జూలై (క్రాంతి న్యూస్): మేడిగడ్డ బరాజ్‌కు వరద ప్రవాహం తగ్గింది. మహారాష్ట్రలో వర్షాలు తగ్గు ముఖం పట్టడంతో వరద క్రమంగా తగ్గుతూ వస్తున్నది. ఆదివారం బరాజ్ ఇన్ ఫ్లో 2,40,460 క్యూసెక్కుల వరద ప్రవాహం రాగా సోమవారం బరాజ్ ఇన్ ఫ్లో 1,75,430 క్యూసెక్కులకు తగ్గింది. ప్రస్తుత నీటి ప్రవాహం బరాజ్ రివర్ బెడ్ నుంచి సముద్ర మట్టానికి 91.00 మీటర్ల ఎత్తులో ఉందని భారీ నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. అదేవిధంగా కాళేశ్వరంలో ప్రాణహిత వరద ప్రవాహం తగ్గింది.

# ఫోన్ ట్యాపింగ్ కేసు.. సిట్ విచారణకు బీఎస్పీ నేత



హైదరాబాద్ ,14 జూలై (ప్రజా పత్రిక): ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ విచారణకు బీఎస్పీ నేత వట్టే జానయ్య హాజరయ్యారు. ఆయన వాంగ్మూలాన్ని అధికారులు రికార్డ్ చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన సూర్యాపేట నియోజకవర్గం నుంచి బీఎస్పీ అభ్యర్థిగా పోటీ చేశారు. ఈక్రమంలో ఎన్నికల సమయంలో వట్టే జానయ్య ఫోన్ ట్యాపింగ్ అయినట్లు అధికారులు గుర్తించారు. దీంతో తాజాగా విచారణకు పిలిచారు.

# వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మహానటి.. పేర్ని నాని సంచలన వ్యాఖ్యలు!



ఏపీ ,14 జూలై (ప్రజా పత్రిక):కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిపై వైసీపీ నేత, మాజీ మంత్రి పేర్ని నాని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మహానటి అని విమర్శించారు. ప్రశాంతి రెడ్డి మహాతల్లి అని కొల్లు రవీంద్ర మాట్లాడుతున్నారని, నెల్లూరు జిల్లాలో ఎవరినీ మైనింగ్ చేయనీయకుండా వేమిరెడ్డి వారే చేయాలని ఆదేశాలు ఇచ్చారు కాబట్టే ఆమె మహాతల్లి అయిందని ఎద్దేవా చేశారు. కొల్లు రవీంద్ర కంటే పగటి వేషగాడు ఏపీలో మరొకరు లేరని మండిపడ్డారు. సీఎం చంద్రబాబు హయాంలోనే తప్పుడు కేసుల పరిపాలన కనపడుతోందన్నారు. తప్పుడు కేసులు నమోదు చేసి అరెస్ట్ చేస్తే న్యాయస్థానాల్లో నిలబెడతాం అని పేర్ని నాని హెచ్చరించారు.

వైసీపీ మాజీమంత్రి పేర్ని నాని తాడేపల్లిలో మీడియాతో మాట్లాడారు. ‘సీఎం చంద్రబాబు ఏలుబడిలో తెరవెనుక నారా లోకేష్ చక్రం తిప్పుతారు. ఒక మహిళ, బీసీ చైర్ పర్సన్ టీడీపీ దుర్మార్గాలను నిలదీయగానే పిల్లి మొగ్గలు వేశారు. దెబ్బలు తిన్నవాళ్లు, అవమానానికి గురైన వాళ్లపై కేసులు నమోదు చేయించుకోవటం కంటే పచ్చి పాపం మరొకటి ఉంటుందా?. వాహనంలో భార్యాభర్తలు హారికా, ఉప్పాల రాముతో పాటు ప్రభుత్వ సిబ్బంది కూడా ఉన్నారు. కేసు పెట్టిన మహిళ.. మంత్రి లోకేష్ దర్శకత్వంలోనే కేసు పెట్టారు. దెబ్బ తగలటం.. కేసు పెట్టడం ఎలా జరిగాయో అందరూ చూశారు. ఇలాంటి దివాళా కోరు, సైకో ప్రభుత్వం ఇప్పటివరకు ఎప్పుడైనా చూశారా?. కూటమి ప్రభుత్వం తప్పుడు కేసులపై సుప్రీంకు వెళ్తాం’ అని పేర్ని నాని తెలిపారు.

‘వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మహాతల్లి. వెనుకబడి గౌడ కులంలో జన్మించిన కృష్ణా జిల్లా పరిషత్ చైర్మన్ మహానటి అని కొల్లు రవీంద్ర మాట్లాడుతారు. ఆమె మహాతల్లి ఎలా అయ్యిందంటే.. నెల్లూరు జిల్లాలో ఎవరిని మైనింగ్ చేయనీయకుండా వేమిరెడ్డి వారే చేయాలని ఆదేశాలు ఇచ్చారు. నెల నెల వాళు పంపే మూటలు ఇస్తుంది కాబట్టి ప్రశాంతి రెడ్డి మహాతల్లి అయ్యింది. కొల్లు రవీంద్ర కంటే పగటి వేషగాడు ఏపీలో మరొకరు లేరు. మీడియాపై బ్రతికే రాజకీయ పార్టీలు కాబట్టి వాళ్లకు డైరెక్షన్ కావాలి. గంజాయి బ్యాచ్‌ని తీసుకువచ్చి వైసీపీ మీటింగ్‌పై ఉసిగొల్పారు. డీఎస్పీ స్థాయి అధికారుల నుంచి చాలా మంది పోలీసులు వారికి బందోబస్తు కల్పించారు. రేపో, మాపో మంత్రి పదవి పీకేస్తామని స్వయంగా చంద్రబాబు చెప్పారు. మంత్రి పదవి పోతుందని ఇష్టానుసారం మాట్లాడారు. ప్రస్తుతం ఏపీలో తప్పుడు కేసుల ప్రభుత్వం నడుస్తుంది. వైసీపీలో యాక్టివ్ గా ఉన్న నేతలపై తప్పుడు కేసులు పెడుతున్నారు. ఏపీకి 13 నెలలుగా పరిశ్రమల శాఖ కమిషనర్ లేకుండా చాలా పరిశ్రమలు తెస్తామని చెబుతున్నారు. ఇది తప్పుడు కేసుల ప్రభుత్వం, దివాళా కోరు ప్రభుత్వం. ఏపీలో రెడ్ బుక్ రాజ్యం నడుస్తుంది. వాళ్లకు నచ్చకపోతే ఏదో కేసు పెట్టి లోపల వేయాలని డిసైడ్ అయ్యారు. ఉప్పాల హారిక విషయంలో వారు ఏం చేస్తారో మేము చూస్తాం?, ఎంత వరకైనా మేము వెళ్తాం’ అని పేర్ని నాని వార్నింగ్ ఇచ్చారు.

# కల్లు దుకాణంలో కల్లు సేవించిన భార్యాభర్తలకు అస్వస్థత



హైదరాబాద్ ,14 జూలై (ప్రజా పత్రిక):జీడిమెట్లలో కల్తీ కల్లు కలకలం రేపింది. నిజామాబాద్ జిల్లా, భోపాల్ కు చెందిన భార్యాభర్తలు రామ్ రెడ్డి నగర్ లోని కల్లు దుకాణంలో కల్లు సేవించి అస్వస్థతకు గురయ్యారు. రెండు రోజుల క్రితం గాజుల రామారం లో నివసిస్తున్న తమ కూతురు రేఖ దగ్గరికి వచ్చారు లచ్చిరాం,సాక్రిభాయ్ అనే దంపతులు. ఊర్లో ప్రతిరోజు కల్లు తాగే అలవాటు ఉండటంతో,రామ్ రెడ్డి నగర్ లోని కల్లు దుకాణంలో నిన్న సాయంత్రం కల్లు సేవించారు లచ్చిరాం దంపతులు. కల్లు తాగినప్పటి నుంచి కాళ్ళు చేతులు లాగడం, పిచ్చిగా ప్రవర్తించడంతో కుటుంబ సభ్యులు గాంధీ ఆసుపత్రికి తరలించారు. హైదర్‌నగర్, కూకట్‌పల్లి, నడిగడ్డతండా, కేపీహెచ్‌బీ తదితర ప్రాంతాలకు చెందిన కొంతమంది కల్లు తాగారు. ఆ రోజు బాగున్నా.. సోమవారం ఉదయం నుంచి క్రమంగా బీపీ పడిపోవడం, కొందరు స్పృహ కోల్పోవడం, తీవ్ర విరేచనాలు, వాంతులు, అచేతనంగా మారి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. కుటుంబ సభ్యులు వీరిని హైదర్‌గూడ రాందేవ్‌రావ్ ఆసుపత్రిలో చేర్చారు. గాంధీలో చికిత్స పొందుతున్న పుట్టి గంగమణి మృతి చెందారు. కల్తీ కల్లు ఘటనలో మృతుల సంఖ్య తొమ్మిదికి చేరింది.

# సినిమా న్యూస్

## భాష వల్ల నేను ఇబ్బందులు ఎదుర్కోలేదు: మాధవన్




కొన్ని రోజులుగా మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల్లో భాషాపరమైన వివాదాలు చెలరేగుతోన్న విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో భాషా వివాదంపై నటుడు ఆర్.మాధవన్ తన వ్యక్తిగత అభిప్రాయాన్ని పంచుకున్నారు. భాష కారణంగా తానెప్పుడూ సమస్యలు ఎదుర్కోలేదని చెప్పారు. “ఇన్నేళ్ల నా కెరీర్‌లో నేనెప్పుడూ భాష కారణంగా ఇబ్బందులు ఎదుర్కోలేదు. నేను తమిళం, హిందీ రెండూ మాట్లాడగలను. అలాగే కొల్హాపూర్‌లో చదువుకున్నాను. కాబట్టి నాకు మరాఠీ కూడా వచ్చు. అందుకే నాకు దీనిపై ఎప్పుడూ ఏ సమస్య రాలేదు” అని చెప్పారు. వివిధ ప్రాంతాల్లో విభిన్న సంస్కృతులు ఉంటాయని మాధవన్ అన్నారు. ఇక ఇదే అంశంపై నటుడు శిఖర్ పహరియా కూడా తన ఇన్‌స్టా వేదికగా ఇటీవల స్పందించారు. “భాషకు ఎంతో ప్రాధాన్యం ఉంది. మనకు ఎన్నో ఇచ్చింది. అన్ని భాషల్లాగే మరాఠీకి కూడా గుర్తింపు, గౌరవం దక్కాలి. అయితే, అది ఇతరుల గౌరవానికి ఇబ్బంది కలిగేలా ఉండకూడదు” అని రాసుకొచ్చారు.మహారాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్‌లో ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే ప్రాథమిక పాఠశాలల్లో మరాఠీ, ఇంగ్లిష్‌తో పాటు హిందీని మూడో భాషగా తప్పనిసరి చేయడంతో వివాదం చెలరేగిన విషయం తెలిసిందే. ఆ రాష్ట్రంలో నివసించేవారు కచ్చితంగా మరాఠీ నేర్చుకోవాలంటూ పలువురు నేతలు చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. దీంతో ఇది చర్చనీయాంశంగా మారింది. మరోవైపు జాతీయ విద్యావిధానం (ఎన్‌ఈపీ)లో భాగమైన త్రిభాషా సూత్రం అమలుపై తమిళనాడు-కేంద్ర ప్రభుత్వాల మధ్య వివాదం కొనసాగుతున్న సంగతి తెలిసిందే.



## చివరికి గెలిచేది సత్యమే!

ఈ ఏడాది వరుస సినిమాలతో అలరించడానికి ముస్తాబవుతోంది అనుపమ పరమేశ్వరన్. ఆమె ప్రధాన పాత్రలో ‘జానకి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ’ అనే చిత్రంలో నటించింది. ప్రవీన్ నారాయణన్ దర్శకత్వం వహించారు. సురేశ్ గోపీ కీలక పాత్ర పోషించారు. జూన్‌లో థియేటర్లలోకి రావాల్సిన ఈ సినిమా పేరును మార్చాలంటూ సెన్సార్ బోర్డు అభ్యంతరం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. తాజాగా సెన్సార్ పనుల్ని పూర్తి చేసుకున్న ఈ సినిమా పేరును ‘జానకి వీ వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ’ అని మార్చినట్లు తెలుపుతూ.. ఇన్‌స్టా వేదికగా కొత్త విడుదల తేదీని ప్రకటించింది చిత్రబృందం. “ప్రతి ఆలస్యం వెనుక.. ఒక విలువైన నిజం ఉంటుంది. అయినా చివరికి సత్యమే గెలుస్తుంది. ఈ నెల 17న సిద్ధంగా ఉండండ”నే వ్యాఖ్యను జోడించింది.

## హనీతో నవీన్ చంద్ర కొత్త ప్రయాణం ప్రారంభం ..!



‘అందాల రాక్షసి’ తో తెలుగు తెరకు పరిచయం అయిన టాలెంటెడ్ హీరో నవీన్ చంద్ర. తన నటనతో మెప్పించినప్పటికీ, కమర్షియల్ హిట్లు మాత్రం కొంత కాలంగా దక్కడం లేదు. అయినా కూడా, ఆయన వినూత్న కథలను ఎంచుకుంటూ తన ప్రయాణాన్ని కొనసాగిస్తున్నాడు. వరుస పెట్టి థ్రిల్లింగ్ చిత్రాలతో అలరిస్తున్నారు. ఇందులో భాగంగా తాజాగా, సైకలాజికల్ థ్రిల్లర్ ‘హనీ’ సినిమా ద్వారా మళ్లీ ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. అయితే నవీన్ సోషల్ మీడియాలో పెట్టిన పోస్ట్ వైరల్ అవుతుంది.

‘మా ప్రయాణం త్వరలో ప్రారంభం..’ అంటూ ఓ ఎమోషనల్ ట్వీట్ చేశారు. దీంతో కొంతమంది నెటిజన్లు అతను కొత్తగా ప్రేమలో పడ్డ డేమోనని అనుకున్నారు. కానీ తీరా విషయం తెలిసి నవీన్ కొత్త సినిమా ప్రమోషన్ మట్టేనని తెలిసి కొంతమంది నిరాశ కూడా వ్యక్తం చేశారు. ఈ చిత్రానికి కరుణ కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. ‘పలాస 1978’ తో విమర్శకుల ప్రశంసలు పొందిన కరుణ కుమార్, ఈసారి భావోద్వేగాలు, మానసిక సంఘర్షణ మధ్య నడిచే గాఢమైన కథతో తెరకెక్కిస్తున్నారని సమాచారం. ఈ చిత్రాన్ని ప్రముఖ కొరియోగ్రాఫర్ శేఖర్ మాస్టర్, రవి పీతలతో కలిసి శేఖర్ స్టూడియో బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. సంగీతం అజయ్ అరసాడ అందించగా, దివ్య పిళ్లై, దివి వడ్లమణి, రాజా రవీంద్ర, కళ్యాణి మాలిక్, బేబీ జయని తదితరులు ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన డబ్బింగ్ కార్యక్రమాలు ప్రారంభమైనట్లు నవీన్ అధికారికంగా ప్రకటించారు.



## ఓనమ్‌కి హృదయపూర్వం



ఇటీవలే ‘తుడరుమ్’ సినిమాతో ఓ సాధారణ టాక్సీ డ్రైవర్‌గా కనిపించి ప్రేక్షకుల మనసుల్ని గెల్చుకున్నారు మలయాళ అగ్రహీరో మోహన్‌లాల్. ఇప్పుడాయన ‘హృదయపూర్వం’ చిత్రంతో సందడి చేయడానికి సిద్ధమయ్యారు. ఆయన ప్రధాన పాత్రలో సత్యన్ అంతికాడ్ తెరకెక్కిస్తున్న చిత్రమిది. మాళవిక మోహనన్, సంగీత్ ప్రతాప్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. తాజాగా ఈ సినిమా ఓనమ్ పండగ సందర్భంగా ఆగస్టు 28న రాబోతున్నట్లు అధికారికంగా ప్రకటిస్తూ.. సామాజిక మాధ్యమాల వేదికగా కొత్త పోస్టర్‌ను పంచుకున్నారు మోహన్‌లాల్.

## రెమ్యూనరేషన్ హైక్‌తో.. షాక్ ఇచ్చిన శ్రీ లీల !

టాలీవుడ్‌లో కొత్త కథానాయకుడిగా కిరీటి రెడ్డిను పరిచయం చేస్తూ రూపొందిన చిత్రం ‘జూనియర్’. ఈ నెల జూలై 18న థియేటర్లలో గ్రాండ్ రిలీజ్‌కు సిద్ధమవుతోంది. యాక్షన్, ఎమోషన్, ఎంటర్‌టైన్‌మెంట్ అన్నీ కలగలిపిన ఈ సినిమాను దర్శకుడు రాధాకృష్ణ రూపొందించారు. ఈ చిత్రంలో యంగ్ సెన్సేషన్ శ్రీ లీల కథానాయికగా నటించడంతో, సినిమాపై ఇప్పటికే భారీ హైప్ క్రియేట్ అయింది. విడుదలైన ట్రైలర్లు, సాంగ్స్ సినిమాపై పాజిటివ్ బజ్‌ని పెంచాయి. అయితే, ఈ సినిమా కోసం శ్రీలీల తీసుకున్న రెమ్యూనరేషన్ ఇప్పుడు టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది.

ఇండస్ట్రీలో వినిపిస్తున్న వార్తల ప్రకారం, శ్రీ లీల ‘జూనియర్’ కోసం ఏకంగా రూ.2.5 కోట్లు రెమ్యూనరేషన్‌గా తీసుకున్నట్లు సమాచారం. ప్రస్తుతం టాప్ హీరోయిన్‌ల సరసన పేరు వినిపిస్తున్న శ్రీలీలకు ఈ స్థాయి డిమాండ్ ఉండటం ఆశ్చర్య పడాల్సిన అవసరం లేదు. పలు బ్లాక్‌బస్టర్ హిట్స్ తర్వాత ఆమెకు క్రేజ్ ఏ స్థాయిలో ఉందో ఈ పారితోషికం స్పష్టంగా చెబుతోంది. ఇక ఈ చిత్రంలో మరో ముఖ్యమైన పాత్రలో జెనీలియా నటిస్తున్నారు. చాలా కాలం తర్వాత తెలుగు తెరకు మళ్లీ రీ-ఎంట్రీ ఇస్తున్న ఆమె క్యారెక్టర్‌కి ప్రత్యేకమైన వెయిటేజు ఉంటుందని సమాచారం. అలాగే దేవీ శ్రీ ప్రసాద్ అందించిన మ్యూజిక్ ఇప్పటికే మంచి రెస్పాన్స్ తెచ్చుకుంటోంది. ఈ ప్రాజెక్టును ప్రముఖ నిర్మాత సాయి కొర్రపాటి నిర్మిస్తున్నారు. ‘జూనియర్’ కిరీటి కోసం ఓ పర్‌ఫెక్ట్ లాంచ్ ప్యాడ్ అవుతుందా? శ్రీలీల భారీ రెమ్యూనరేషన్‌కు తగ్గ హిట్‌ను అందుకుంటుందా? అన్న దాన్ని ప్రేక్షకుల స్పందన నిర్ణయించనుంది. కానీ ప్రస్తుత బజ్‌ను బట్టి చూస్తే ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద మంచి ఓపెనింగ్స్ తెచ్చేలా ఉంది.